# ఇల్లాలు

అవును ఆమె అతని భార్య. అసలు ఆమె పుట్టడం అతని భార్యగానే పుట్టిందిట! కన్నవాళ్ళు పదేళ్ళకే ఆమె మెడలు వంచి తాళికట్టించారు. ఆమె కూడా ఆ మాట కాదనడం లేదుకాని అది ఏనాటిమాట!

ఆమె నాలుగేళ్ళ క్రితం అతని భార్యే మరి యిప్పుడు? ఏమో చెప్పలేం. చట్ట ప్రకారంగానైతే రెండేళ్ళు కలిసి వుండకపోతే ఆమె విడాకులు కోరవచ్చు. కనీసం తాను అతని భార్యను కాననే హక్కుంది. అలా ఆమె స్వతంత్రంగా జీవించవచ్చు.

అయితే యివేవీ ఆమెకు తెలియవు. తెల్సినా కలిగే అదనపు లాభమూ లేదు. అసలు ఆమె విడాకులు తీసుకోవాల్సిన అవసరమే రాలేదు. ఇక బ్రతుకా? నాలుగేళ్ళుగా స్వతంత్రంగానే బ్రతుకుతోంది. అయినా అతను ఉన్నపుడు మాత్రం కూర్చుని తిని బతికింది గనుకా?

అతను పోయాడు ఎక్కడికి పోయాడో తెలియదు. ఎంతదూరాన వున్నాడో తెలియదు. చనిపోలేదని మాత్రం ఆమెకు ఎందుకో కొండంత విశ్వాసం. అందుకేనేమో యింకా ముత్తయిదువులా గాజులు వేసుకుంటుంది. వీలైనపుడల్లా నొసట బొట్టు పెట్టుకుంటుంది. ఆ పల్లెవాళ్ళు ఆమెను ముత్తయిదువగానే చూస్తారు.

అయినా ఆమె యింకా అతన్ని ప్రేమిస్తుందని చెప్పలేం. అలా అని నిండుగా ద్వేషిస్తుందనీ చెప్పలేం. అయితే ఆమె ఏదో ఒక సందర్భంలో అతన్ని తలుచుకోని రోజుండదు. తిట్టని రోజుండదు. ఏడ్వని రోజుండదు. అదీ ఆమె జీవితం.

అతడు ఆమెను వదిలేశాడు. నిజానికి అలా వదిలేశాడని చెప్పలేం. అతడు ఆమెను వదిలి వెళ్లిపోయాడు. అంతే. అతన్నుండి ఏ కబురూ లేదు. నాలుగేళ్ళుగా ఎవరిదోవన వాళ్ళు బతుకుతున్నారు.

ఆమె యిప్పుడెలా బతుకుందో అతనికి తెలుసోలేదో! అసలు అతనికి ఆమె గుర్తుందో లేదో తెలియదు. ఆమెకు మొదట్లో కొంచెం ఆశ వుండేది. ఆమెకు ఆ ఆశల చెట్టు ఎండిపోయింది. ఆమె కూడా ఎండిపోయిన ఎముకల చెట్టయిపోయింది.

ఆమెకు కన్నవాళ్ళున్నారు. అన్నా, అక్కా, తమ్ముడూ, చెల్లీ వున్నారు. మరుదులున్నారు, ఆడపడుచులూ వున్నారు. అయినా ఆమె సంసారం ఆమెదే. కన్నవారింటికి కాపురాన్ని తరలించలేనంత ఆత్మాభిమానం ఆమెది. అయినా ఎవరివద్దవున్నా ఏం వుందనీ, ఎవరి బతుకు వారిదే. ఎందరిలానో ఆమె కూడా పెళ్ళి కోసం పెంచబడింది.

అందుకే అతను వదిలిపోయిన గుడిసెలోనే ఆమె జీవిస్తోంది. అతను వదిలేసిన పిల్లల్తోనే జీవిస్తోంది. అతను వదిలేసిన జ్ఞాపకాల్తో జీవిస్తోంది. అతను వదిలేసిన బాధ్యతలకు గార్డియన్‌గా జీవిస్తోంది.

అతను ఆమెను వదిలేసి వెళ్ళిపోయాడని ఆ ఊళ్ళో అందరికీ తెలుసు. అయినా అతని నీడ ఆమెను నిత్యం పీడలా వెన్నాడుతూనే ఉంది. నిజానికి పీడలకు అతని ప్రమేయం లేదేమో.

నడిమివాళ్ళు, నడమంత్రపు సిరిగలవాళ్ళు తెస్తున్న కష్టాలమధ్య నలిగిపోతోంది ఆమె. ఆమెది ఒంటరి ఆకాశం, ఆ ఊరి ఆకాశం నిండా నిర్బంధం నిరాశా చీకటి పరుచుకుంది. ఆమె పిడికెడు గుండె జడుసుకుంటోంది.

అయినా ఆమె జీవిస్తోంది. బతక్క తప్పదు కనక జీవిస్తోంది. ఆత్మహత్యంటే అసహ్యం, భయం, కనుక జీవిస్తోంది. పిల్లల మీద మమకారం కనుక జీవిస్తోంది. అందుకే ఆమె చనిపోలేదు. అందుకే చనిపోదామనుకుని చనిపోలేక పోయింది. ఇదే ఆమె చేస్తున్న నేరం అనుకున్నారేమో నడమంత్రపు వాళ్ళు.

వాళ్ళ చూపు పెద్దది. ఆ చూపుకు ఆమె ఒళ్ళు ఎన్నిసార్లు పుళ్ళయ్యాయో లెక్కేలేదు. లెక్క పెట్టుకుంటే వచ్చే లాభమూ లేదు. ఇప్పటికి నాలుగుసార్లు ఆమె గుడిసెను పీకి కుప్పేశారు. నిలవ నీడ లేకుండా చేశారు.

తన శరీరానికి స్పర్శ ఉందని ఆ పుళ్ళు గుర్తు చేస్తుంటాయి. వారం పది రోజులు మంచం మీంచి లేవనీయవు. అప్పటి బాధ మరో తీరుగా ఉంటుంది. ఇద్దరిలో ఏ ఒక్కరు చచ్చినా బాగుండేదని. ఆ తిట్లూ, దెబ్బలూ అతని కారణంగానే. ఎక్కడో ఏదో జరిగిందట! అందులో అతనున్నాడట! అతన్ని ఎక్కడ వెతకాలో తెలియకపోతే ఇలా విరుచుకుపడాలట! అలా ఎక్కడా రాసి లేదు. అయినా చేసేది అదే. అలా అతను ఈ నాలుగేళ్ళుగా ఆమెను వదిలింది లేదు. అయిన అతను కన్పించడు. అప్పుడప్పుడు యిలా వినిపిస్తుంటాడు.

ఆమె జీవితంలో వసంతాలు మళ్ళీ, మళ్ళీ వాడిపోతున్నాయి. అతనితో కలిసివున్న వసంతాలు స్మృతుల్లోనూ కనుమరుగవుతున్నాయి. ఇటీవల అతను వినిపించడమూ ఆగిపోయింది. అందుకు ఒళ్ళు పుళ్ళు కానందుకు సంతోషమూ, మరొకందుకు భయమూ, ఆందోళనా, అలా క్రమంగా ఆమె మనస్సుకు శాంతే కరువైపోయింది. ఆ మౌనం మరింత బాధగా ఉంది. అంటే ఆమె యింకా అతన్ని ప్రేమిస్తూనే ఉంది. అతని భార్యగానే జీవిస్తోంది. అయినా అతడు కనిపించడు. వినిపించడు.

ఆగిపోయిన అతని ధ్వని ఒక్కసారిగా విరుచుకుపడింది. ఎక్కడో నడమంత్రపు సిరిగల వాడెవడో పోయాడట. దాని తాలూకు తుఫాను తాకిడికి ఆమె గుడిసెతో పాటు ఆ ఊళ్ళో మరో అయిదు ఇళ్ళు నేలమట్టమయ్యాయి. ఆ చుట్టుపక్కల ఊళ్ళల్లో మరో వంద ఇళ్ళు కూలిపోయాయి.

అతని నీడే ఆమెకు అయిదోసారి నిలవనీడ లేకుండా చేసింది. ఆరేళ్ళ కూతురు తలపగిలి నెత్తుటి మడుగయింది. పదకొండేళ్ళ కొడుకు చెయ్యి విరిగిపోయింది. ఆమె అసలు లేవలేకుండా పడిపోయింది. వారం రోజులు ఆ కూలిన శిథిలాల్లో శిథిలాల్లా ఉండిపోయారు వాళ్ళు.

ఆమెకు ఆశ్రయం ఇచ్చినా ఆమె గుడిసె మళ్ళీ లేచినా వాళ్ళందరికీ మళ్ళీ అదే గతి పడ్తుందని హెచ్చరించారు నడమంత్రపు వాళ్ళు. మరోసారి ఓ పది రోజులు భయమే రాజ్యమేలింది. ఆనక ఆమె గుడిసెని ఆ ఊరు మళ్ళీ నిలబెట్టింది. అది గుడిసె ఆకారమే కాని మునుపటి గుడిసె కాదు. మునుపటి సామానూ లేదు. అదొక పందిరి కింది సంసారం. అదే మహాభాగ్యంగా ఓదార్పుగా కళ్ళు తుడుచుకుంది ఆమె.

తుడుచుకున్న ఆమె కళ్ళ తడి ఆరనే లేదు. మరో వార్త వినిపించింది. అప్పుడు అతను లేడు. ఆమెకు వాళ్ళు కనీసం అతని శవాన్నైనా యివ్వలేదు. చంపేసిన వాళ్ళే ఎక్కడో బూడిద చేశారు. కళ్ళారా చూడని వార్తను ఆమె నమ్మలేకపోయింది. ఏ మూలో ఆశ మినుకు మినుకుమంటోంది.

అలా నెల గడిచిందో లేదో నాన్న గురించి రాశారట అంటూ లేత కాళ్ళతో పరుగున వచ్చింది కూతురు. ఆ లేత చేతిలో ఏదో రంగు కాగితం. దానిపై వాళ్ళ నాన్న ఫోటో, ఆమె పొంగి పొరలి ఏడ్చింది.

అలా అతను పూర్తిగా వెళ్ళిపోయాడు. ఆమె జీవితంలో మరో అధ్యాయం అర్థాంతరంగా ముగిసింది. అయినా విచిత్రంగా అతని బాధ్యతలు ఆమెకు మిగిలే ఉన్నాయి. అతని బాధ్యతలే ఆమె బాధ్యతలై ఆమె జీవితాన్ని అదుపు చేశాయి. ఆ జీవితాన్ని ఆమె కోరుకోలేదు. అతనికి మాత్రం తాను కోరుకున్న జీవితమే కాదు. చావు కూడా అతను కోరుకున్న విధంగా జరిగిపోయింది. కానీ ఆమె ప్రమేయం ఏమీ లేకపోయినా మళ్ళీ అదే ఆమె జీవితమై పోయింది.

రెండో పెళ్ళి ఆమె బాధ్యతలకూ, త్యాగాలకూ అడ్డు కాకుండానూ చేసికోవచ్చు. చేసికోవచ్చనే ధైర్యాన్నివ్వ లేకపోయింది సమాజం. అలా ఆమె రెండో పెళ్ళి చేసుకోలేక పోయింది.

కాలం గడుస్తోంది. వయసు పెరుగుతోంది. అనుభవాల్తోపాటు ఆమెలో ధైర్యం కూడా పెరుగుతోంది. ఇప్పుడు ఆమె పెళ్ళి చేసికోవడానికి సమాజపు వెక్కిరింతలు లెక్క చేయకుండా ధైర్యం కూడగట్టుకుంది. కాని యిప్పుడు పెళ్ళి చేసికోలేదు. ఇప్పుడు ఆమె పిల్లలు ఆమెను క్షమించే స్థితిలో లేరు. వాళ్ళకు మునుపటి అమ్మే కావాలి. రెండో పెళ్ళి చేసికొన్నా ఆమెకు మునుపటి పిల్లలూ, మునుపటిలాగే కావాలి మరి. ఆమెకు రెండూ కావాలి. కానీ సమాజం ఆమెను ఏదో ఒకటి కోరుకోమంది. ఆమె వాత్సల్యాన్నీ, మాతృత్వాన్నే కోరుకుంది. అలా ఆమె నూరేళ్ళ వైవాహిక జీవితంలో ఆమె నోచుకున్నది అతనితో గడిపిన ఆ ఎనిమిదేళ్ళే.

★ ★ ★

ఇపుడు ఆమె ముసలిదైపోయింది. అంది వచ్చిన పెళ్ళికాని కొడుకు తండ్రిలాగే పోయాడు. పెళ్ళయిన కూతురు, తల్లిలాగే మళ్ళీ తల్లివద్దకు రాకుండా తన ఊళ్ళోనే ఉండిపోయింది.

ఆమె చూపు పడిపోయింది. ఆమె వాళ్ళెవరూ ఆమెకు కనిపించరు. ఆమె జీవితంలో విషాదం మళ్ళీ మళ్ళీ పునరావృతమౌతూనే ఉంది. అది ఆమెపట్ల మొదటిసారికన్నా మరింత విషాదంగా క్రూరంగా ప్రవేశించింది. కన్నతల్లికి కడుపు శోకం.

బాధలుతీరని ఆమె జీవితంలో పెద్ద మార్పేమీలేని మరో రంగు కాగితం. ఆ కాగితంలో అతను పుట్టిన ఊరుంది. పెరిగిన తీరు, చేసిన పనులూ ఉన్నాయి. వాటికి తగిన నివాళి ఉంది. లేనిదల్లా ఆమె చేసిన త్యాగాల గురించే. అయినా ఇవేవీ ఆమెకు తెలియవు. తెలిసినా చేయగలిగిందీ లేదు.

అలా ఆ కాగితం ఆమె జీవితంలో మరో అధ్యాయాన్ని మరింత అర్థాంతరంగా ముగించేసింది. చివరకు ముడుతలు పడ్డ శరీరంతో ఒంటరిగా అడవిలో పండుటాకులా ఆమె కూడా రాలిపోయింది.

తెల్సినవాళ్ళు ఆమెని ఫలానా వాళ్ళ కూతురని గుర్తు చేసుకొన్నారు. కొందరు ఆమెను అతని భార్యగదా అని మెచ్చుకున్నారు. చాలామంది ఆమె అతని కన్నతల్లిగానూ కీర్తించారు. అలా ఆమె ఒకరి కూతురుగా, ఒకరి భార్యగా, ఒకరి కన్నతల్లిగానో తప్ప ఈ పితృస్వామిక భాష ఆమెకంటూ ఒక సొంత పేరు లేకుండా చేసింది. అసలు అలాంటి భావాలుంటే కదా భాష ఉండడానికి. తనది కాని జీవితం కోసం ఆమె పుట్టింది పెరిగింది. తనది కాని జీవితంగానే తనువు చాలించింది. సమాజం ఆమెనుండి కోరే త్యాగాలే తప్ప హక్కులు లేని సామాజిక జీవితం ఆమెది. అన్ని పరిస్థితుల్లో కరిగిపోయే త్యాగశిల ఆమె. కుటుంబాన్ని పోషిస్తూ సమాజం కోసం ఆమె చేసిన త్యాగాల చరిత్ర యిది. ఆమె పేరు ఇల్లాలు.

*(రచనాకాలం : 1987)*

**మే 1-15, 1991,**

**నలుపు పక్షపత్రిక.**